సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నెలరోజుల పాటు పకడ్బందీగా 'జగనన్న సురక్ష'

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యలు పరిష్కరించడంతోపాటు అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా ఈనెల 23 నుంచి జూలై 23 వరకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు పరచడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో జరిగిన సమావేశంలో ఉపాధి, ఇల్లు నిర్మాణాలు, విత్తనాలు, ఎరువులు, ఈ క్రాప్ బుకింగ్, గడపగడపకు మన ప్రభుత్వం, ప్రజా పంపిణీ వ్యవస్థ, ప్రభుత్వ భవన నిర్మాణాలు తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి ఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ కొండయ్య, డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేయాలన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సిబ్బంది, వాలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరించాలని తెలిపారు. ఆ ఇంటికి సంబంధించి సమస్యలు అయినా పరిష్కారం కాలేదా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అనే అంశాలుపై పరిశీలించాలన్నారు. మండల స్థాయిలో ఎంపిడీవో, డిప్యూటీ తహశీల్దార్ ఒక టీం, తహశీల్దార్, ఈవోఆర్డీ కలసి మరో టీంగా ఏర్పడి సచివాలయాల తనిఖీలు నిర్వహించాలని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు. సమస్యలు ఉన్నవారు ఆయా సచివాలయాల వద్దకు వస్తే పరిశీలన బృందాలు ఆయా సమస్యలు పరిష్కరించడానికి అవకాశం ఉంటుందన్నారు. దీంతో అక్కడికక్కడే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. నేటి నుంచే పై కార్యక్రమాలు ఏర్పాటుకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మునిసిపాలిటీ పరిధిలో కమిషనర్ సిబ్బంది టీంలుగా ఏర్పడి నెలరోజుల పాటు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 1720 పనులు ఆమోదించడం జరిగిందని, 1308 పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయని చెప్పారు. ప్రతిరోజు జిల్లాలో కనీసం లక్ష పని దినాలు కల్పించి అనుకున్న లక్ష్యం పూర్తి చేయాలన్నారు. ఎండ తీవ్రంగా ఉన్నందున ఉదయం 11 గంటల లోపే పనులు కల్పించాలని కూలి రూ. 272 వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జగనన్న గృహాలు జులై 15 నాటికి జిల్లాలో 4500 ఇళ్లు పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఖరీఫ్ లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని నకిలీ సరుకులు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సిపిఓ విజయ్ కుమార్, గృహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, డిఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు, ఐసిడిఎస్ పీడీ కృష్ణకుమారి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా పనులను పూర్తి చేయాలి

హిందూపురం : పురపాలక సంఘం పరిధిలో ఇప్పటికే టెండర్లై, అగ్రిమెంట్ పూర్తయిన పనులను గుత్తేదారులు గడువులోగా పూర్తి చేయాలని ఛైర్‌పర్సన్ ఇంద్రజ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ వైస్ ఛైర్మెన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌లతో కలిసి ఆమె గుత్తేదారులు, ఇంజనీరింగ్, అమ్యూనిటీ సెక్రెటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురపాలక సంఘ వ్యాప్తంగా 10 మంది గుత్తేదారులు వంద పనులకు అగ్రిమెంట్ చేశారే కానీ ఇంత వరకు పనులను ప్రారంభించలేదన్నారు. వీటిని వెంటనే ప్రారంభించి పనులను పూర్తి చేయాలన్నారు. అలాగే వంద ఇళ్లు చొప్పున నిర్మాణం చేయడానికి గుత్తేదారులు ముందుకు రావాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు మద్దన జయరాములు, తదితరులు పాల్గొన్నారు.

కొలత... కలత

'వెనుక దగా..ముందు దగా...అన్న మహాకవి మాటలు జిల్లాలోని కొందరు వ్యాపారులకు అతికినట్టు సరిపోతాయి. వస్తువుల క్రయ విక్రయాల్లో భారీగా మోసాలకు పాల్పడుతున్నారు. తూనికలు, కొలతల్లో దగా చేస్తున్నారు. కల్తీ రాజ్యమేలుతోంది. వినియోగదారుడు నిలువు దోపిడీకి గురవుతున్నాడు. వీటిని నియంత్రించాల్సిన తూనికలు, కొలతలు, ఆహార కల్తీ నిరోధక శాఖలు నిద్దరోతున్నాయి.

తూనికలు, కొలతల్లో మోసం
వస్తువుల క్రయ, విక్రయాల్లో దోపిడీ
పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ విక్రయాల్లో తేడాలు



ప్రజాశక్తి-హిందూపురం

పండ్ల నుంచి కూరగాయల వరకూ, సిమెంటు నుంచి ఎరువుల వరకూ, పెట్రోలు, డీజిల్ ఇలా ప్రతి వస్తువు విక్రయంలోనూ జిల్లాలో భారీగా మోసాలు చోటు చేసుకుంటున్నాయి. ఓవైపు కల్తీ... మరోవైపు తూకాల్లో మోసాలతో వినియోగదారులు నష్టపోతున్నారు. కొందరు వ్యాపారులు కనీస ప్రమాణాలు పాటించడం లేదు. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్ అమ్మకాల్లో ఎక్కువగా మోసం జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా వందకుపైగా పెట్రోల్ బంకులు ఉన్నాయి. కొన్ని పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ట్యాంపరింగ్ చేస్తున్నాయి. లీటరు పెట్రోల్‌కు 100 నుంచి 200 మిల్లీలీటర్ల వరకూ పక్కదారి పట్టిస్తున్నారు. బంకుల వద్ద కనీస నిబంధనలు పాటించడం లేదు. ఏరోజు కారోజు పెట్రోల్, డీజిల్ ధరలను ప్రదర్శించాల్సి ఉన్నా ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. కొన్ని బంకుల్లో కల్తీ జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. హిందూపురంతో పాటు అనంతపురం జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల్లోని బంకుల్లో కల్తీ జరుగుతున్నట్లు, కొలతల్లో తేడాలు ఉంటున్నట్లు అధికారుల తనిఖీలో గతంలో వెల్లడైంది. అక్కడితో తనిఖీలు ఆగిపోయాయి. ఎప్పుడో గానీ సంబంధిత అధికారులు కదలడం లేదు. పెట్రోల్ నాణ్యతను తెలుసుకునేందుకు బంకుల వద్ద ఫిల్టర్ పేపర్ టెస్ట్ అందుబాటులో ఉంచాలి. ఆ పేపరుపై రెండు మూడు చుక్కలు పెట్రోల్ వేస్తే అది ఆవిరైపోతే నాణ్యత కలిగినదిగా గుర్తించవచ్చు. అదే మరకలుగా మిగిలిపోతే కల్తీ జరిగినట్లు నిర్ధారించవచ్చు. ఈ విషయం చాలామంది వినియోగదారులకు తెలియదు. ప్రస్తుతం లీటరు పెట్రోల్ ధర రూ.116కి చేరింది. డీజిల్ రూ.100దాటింది. ఇదే సమయంలో కల్తీ, తూకాల్లో తేడాలతో వినియోగదారుడు కుదేలవుతున్నాడు. బంకులు అందుబాటులో లేనిచోట విడిగా విక్రయాల పేరిట భారీ దోపిడీ జరుగుతోంది. లీటరు పెట్రోల్‌కు రూ.120కుపైగా విక్రయిస్తున్నారు. పైగా కల్తీ పెట్రోల్ అమ్మకాలు చేస్తున్నారు. దీంతో వాహనాల ఇంజన్లు పాడవుతున్నాయి.

సిమెంట్, ఇనుము విక్రయాల్లోనూ అదే పరిస్థితి

గృహ నిర్మాణ సామగ్రి అమ్మకాల్లో కూడా మోసాలు జరుగుతున్నాయి. 25 కేజీల సిమెంట్ బస్తా వద్ద కేజీ, కేజీన్నర తరుగు వస్తోంది. కంపెనీలు నిబంధనల సంగతి పక్కన పెడితే, కొంతమంది దళారులు బస్తాల్లోని సిమెంట్ తీసి రీ ప్యాకింగ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇనుము కేజీల లెక్కన విక్రయించాల్సి ఉన్నా జిల్లాలో చాలామంది వ్యాపారులు విడి పరికరాల కింద అమ్ముతున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా గృహ నిర్మాణం జోరుగా సాగుతోంది. జగనన్న కాలనీలు, సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల నిర్మాణానికి సిమెంట్, ఇనుము ఎక్కువ అవసరం. నిత్యం లక్షలాది రూపాయల క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. ఇదే అదునుగా వ్యాపారులు తూనికలు, కొలతల్లో మోసానికి పాల్పడుతున్నారు.

వంట గ్యాస్‌లో నయా మోసం

వంట గ్యాస్‌లో కూడా మోసం పెరుగుతోంది. కొన్ని ఏజెన్సీలు ప్రభుత్వం ఇచ్చే ఇన్సెంటివ్ కాకుండా డెలివరీ ఛార్జీల పేరిట అదనంగా వసూలు చేస్తున్నాయి. గ్యాస్ సిలిండర్లలోనూ కొన్నిచోట్ల తరుగు ఉన్నట్టు తెలుస్తోంది. ఒక్కో సిలిండర్ వద్ద రెండు కిలోల వరకూ తగ్గుముఖం పడుతోంది. డెలివరీ బాయ్స్ బాదుడు సంగతి చెప్పక్కరలేదు. ఒక్కో సిలిండర్‌పై సగటున బిల్లుతో పాటు అదనంగా రూ.20 నుంచి రూ.50 వరకూ వినియోగదారుడు చెల్లించుకోవాల్సిందే.

నిత్యావసరాలూ అంతే...

నిత్యావసరాలు, ఇతర ఆహార పదార్థాలు, పండ్ల తూకాల్లో మోసాల సంగతి చెప్పనక్కర్లేదు. కిలో దగ్గర 200 గ్రాముల వరకూ తగ్గించి అమ్ముతున్నారు. కొన్ని వస్తువులను ప్రామాణిక ముద్రతో విక్రయించాల్సి ఉన్నా ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారు. ప్రధానంగా వారపు సంతలు, మార్కెట్లు, రైతు బజారుల్లో సైతం రాళ్లనే తూనికలకు వినియోగిస్తున్నారు. ఇక సాధారణ తూనికరాళ్లపై ఎటువంటి ముద్రలూ ఉండవు. గ్రామీణ ప్రాంతాల్లోనైతే వ్యాపారులు చెప్పిందే వేదం. తూనికలు, కొలతల శాఖ అధికారులు తూతూమంత్రపు తనిఖీలకే పరిమితమవుతున్నారు. సిబ్బంది కొరత పేరుతో సంబంధిత అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతున్నారు. హిందూపురం పట్టణంలో కూరగాయల మార్కెట్‌తో పాటు ఎన్టీఆర్ సర్కిల్ నుంచి మేళాపురం సర్కిల్ వరకు, ఇతర ప్రాంతాలలో పండ్ల వ్యాపారుల్లో అత్యధిక శాతం తూనికల్లో యథేచ్ఛగా మోసాలకు పాల్పడుతున్నారు. ఇక ఆహార కల్తీ నియంత్రణ అధికారుల జాడే లేకుండా పోతోంది. వారు వచ్చినా తూతూ మంత్రంగా తనఖీలు చేసి పోతాన్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరముంది. స్వీట్ల దుకాణాల్లో వాటిపై తయారీ తేదీ ఉండాలనే నిబంధన ఉన్నప్పటికి జిల్లా కేంద్రంతో సహా ఎక్కడా ఒక్క షాపులోనూ వీటిని ముద్రిస్తున్న దాఖలాలు లేవు. ఇక హోటళ్లలో అయితే రూ.300 పెట్టి ఒక బిర్యాని కొన్నా కనీసం తాగునీరు ఇవ్వడం లేదు. హోటళ్ల నిర్వాహకులు చెప్పిందే ధర...ఇచ్చిందే భోజనం అన్నట్లు ఉంది. వీటిపై ఆహార కల్తీ నియంత్రణ అధికారులతో పాటు తూనికలు కొలతల శాఖ, రెవిన్యూ, మున్సిపల్ శాఖ అధికారులు సైతం తనఖీలు చేయడానికి అధికారాలు ఉన్నప్పటికి ఎవరు చేయడం లేదు.

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం

తూనికలు, కొలతలపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఎక్కడైనా మోసాలు జరిగితే వెంటనే ఫిర్యాదు చేయాలి. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతున్నాం. వ్యాపార సంస్థలు నిర్ణీత ప్రమాణాలు పాటించాలి. లేకుంటే చర్యలు తప్పవు. సిబ్బంది కొరత ఉంది, ఉన్నా ఉన్నంతలో తనిఖీలు చేపడుతున్నాం.

సుధాకర్,
తూనికలు, కొలతల నియంత్రణ జిల్లా అధికారి

సమావేశంలో మాట్లాడుతున్న జెసి చేతన్, అగ్రిబోర్డు ఛైర్మన్ రమణారెడ్డి

రైతులకు మెరుగైన సేవలందించాలి

జెసి చేతన్, అగ్రి బోర్డ్ ఛైర్మన్ రమణారెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టాలని, రాయితీ వేరుశనగ విత్తన కాయలు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తిక్, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో వేరుశెనగ విత్తన కాయలు దుర్వినియోగం కాకుండా చూడాల న్నారు. దీనిపై అధికారులు అవగాహన కల్పించాల న్నారు. ఆర్ బి కె పరిధిలో రైతులకు మెరుగైన సేవ లు అందించాలన్నారు. డ్రిప్పు పరికరాలు త్వరగతిన రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. ఆర్ బి కె లలో పశుసంవర్ధక శాఖ పథకాలకు సంబంధించి కరపత్రాలు ప్రదర్శించాలన్నారు. రాగి సాగును ప్రోత్సహించాలని జలకల క్రింద దరఖాస్తు చేసుకున్న రైతులకు ఉచితంగా బోరు వేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాల వెల్లువ పథకం కింద 41 గ్రామాల్లో పాల సేకరణ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బా రావు, పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్, సిరి కల్చర్ జెడి పద్మమ్మ, మార్కెటింగ్ శాఖ అధికారి నరసింహమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

వైసిపి కుట్రలు గామస్థాయిలో ఎండగట్టాలి

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

2024 ఎన్నికలకు ముందే వైసిపి ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలు, మోసాలకు పాల్పడుతోందని కావున క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, బూత్ కన్వీనర్లు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గం ఇన్‌ఛార్జి పల్లె రఘునాథ్ రెడ్డి హెచ్చరించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం క్లస్టర్ బూత్ లెవెల్ కన్వీనర్లతో టిడిపి ముఖ్య నాయకులకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ ఓడిపోతామనే భయంతో వైసిపి నాయకులు ఓటర్ లిస్టులో పేర్లు తొలగింపు, నివాసమే లేని వారిని ఓటర్లుగా చేర్చడం లాంటి కుట్టలకు పాల్పడుతోందన్నారు. వారి కుతంత్రాలకు తావివ్వకుండా ఎప్పటికప్పుడు పరిశీలించుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి పట్టణ గ్రామీణ కన్వీనర్లు రామాంజనేయులు, విజయ్ కుమార్, ఐటీడీపీ కన్వీనర్ కొత్తపల్లి జయప్రకాష్, నాయకులు బొమ్మయ్య, సామ కోటి ఆదినారాయణ, బేకరీ నాయుడు, కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పల్లె రఘునాథ్ రెడ్డి

షుగర్ ఫ్యాక్టరీ భూములపై సుప్రీంకోర్టు స్టే

ప్రజాశక్తి - పరిగి

మండల కేంద్రంలో షుగర్‌ఫ్యాక్టరీ కోసం సేకరించిన భూములను ఇతర ప్రయోజనాలకు ఉపయోగించరాదని సుప్రీంకోర్టు స్టే ఇచ్చినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ తెలిపారు. ఈసందర్భంగా శుక్రవారం భూ నిర్వాసితులతో కలిసి షుగర్ ఫ్యాక్టరీ గేటు వద్ద బోర్డులను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన షుగర్ ఫ్యాక్టరీ భూములలో పరిశ్రమలు తప్ప ఇతర ఏ ప్రయోజనార్థం భూములను వినియోగించరాదని భూ నిర్వాసిత రైతులు భూ పోరాటాలు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో పరిశ్రమలైన పెట్టండి లేదా తమ భూమి తమకే ఇవ్వండి అని డిమాండ్ చేస్తూ సుప్రీంకోర్టును భూ నిర్వాసిత రైతులు ఆశ్రయించినట్లు చెప్పారు. ఈ రైతుల పోరాటానికి సిపిఎం పూర్తి మద్దతు ఇస్తూ రైతుల పక్షాన పలు విధాలుగా భూ పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా భూములను స్వాధీనం చేసుకుని ఆ భూముల్లో పంటను సాగు చేస్తే దీన్ని జీర్ణించుకోలేని ప్రయివేటు యాజమాన్యం పలుమార్లు పోలీసులతో నిలుపుదల చేయించడమే కాకుండా అరెస్టు చేయించిన సంఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ఎప్పటికైనా రైతుల భూములు రైతులకు ఇవ్వాలని అంతవరకు తమ పోరాటాలు ఆపేది లేదని కోర్టును ఆశ్రయించినట్లు వివరించారు. రైతుల వాదనలను పూర్తిగా విన్న న్యాయస్థానం ఈ భూములపై స్టే విధించిందన్నారు. రియల్ ఎస్టేట్ కానీ ఇతర వినియోగానికి గాని కోర్టు ఒప్పుకోకపోగా ఈ అంశంపై పూర్తిస్థాయి న్యాయ విచారణకు ఆదేశించిందని ఈసందర్భంగా ఇంతియాజ్ తెలిపారు. పరిశ్రమల కోసం తీసుకున్న ఈ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్న ప్రయివేటు యాజమాన్యం తీరా ఈ భూములను రియల్ ఎస్టేట్ వినియోగించుకోవడం సరైన విధానం కాదని అన్నారు రైతులకు న్యాయం జరగాలని ఉద్దేశంతోనే తాము సుప్రీంకోర్టును ఆశ్రయించామని అక్కడ రైతులకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసిత రైతులు గణేష్, వెంకటేష్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ భూముల్లో బోర్డు నాటిన రైతులు

ఫ్యాక్టరీ భూముల్లో బోర్డు నాటుతున్న నాయకులు

న్యాయమూర్తి ఆనందతీర్థను సన్మానిస్తున్న జడ్జి శైలజ, తదితరులు

అంకితభావానికి నిదర్శనం ఆనంద తీర్థ

అదనపు జిల్లా జడ్జి శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

న్యాయమూర్తి ఆనందతీర్థ వృత్తి పట్ల అంకితభావంతో పనిచేశారని అదనపు జిల్లా జడ్జి శైలజ పేర్కొన్నారు. ఆనంద్ తీర్థ పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏడిజె ఆనంద తీర్థ సేవలను కొని ఆడారు. గత పది ఏళ్లుగా ఆనంద తీర్థ ప్రత్యేక న్యాయమూర్తిగా తన వంతు విధులను అంకితభావంతో నిర్వహించారని తెలిపారు. అనంతరం ప్రత్యేక న్యాయమూర్తి ఆనంద తీర్థ మాట్లాడుతు వత్తిలో తనకు అందరూ ఎంతో సహకారం అందించారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆయన్ను ఏ డి జె తో పాటు కోర్టు ఉద్యోగులు శాలవాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆనందరావు, సూపరిటెండెంట్ వెంకటేష్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు నాగరాజు, సిద్ధూ, హిదయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేని ప్రతిపక్షాలు : ఎమ్మెల్యే

కదిరి టౌన్ : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు సీఎం జగన్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ బురద జల్లే కార్యక్రమం చేస్తున్నాయని ఎమ్మెల్యే పిపి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. పట్టణంతో పాటు మూర్తిపల్లి, వికలాంగుల కాలనీ, ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో శుక్రవారం ఎమ్మెల్యే 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి సంక్షేమ ఫలాలను వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే చేరవేస్తున్నారన్నారు. వాటిని నమ్మద్దని ప్రజలకు సూచించారు. రాబోయే రోజుల్లో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ రాజశేఖర్ రెడ్డి, టెంపుల్ ఛైర్మన్ గోపాలకష్ణ, ఎంపిపిలు, జడ్పిటిసిలు, వైస్ ఎంపిపిలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపిటిసిలు, జెసిఎస్ ఇన్‌ఛార్జిలు, సర్పంచిలు, డైరెక్టర్లు, పోలింగ్ బూత్ మేనేజర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కన్వీనర్లు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

వ్యవసాయరంగం అభివృద్ధికి సిఎం జగన్ కృషి

ప్రజాశక్తి-బత్తలపల్లి

వ్యవసాయ రంగం అభివృ ద్ధికి సీఎం జగన్ ఎంతో కషి చేస్తున్నా రని ఎంపిపి బగ్గిరి త్రివేణి పేర్కొన్నారు. మండల పరిధిలోని గుమ్మల్లకుంట ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి సహకారంతో రూ. 82 లక్షలతో నిర్మించనున్న ఆర్‌బికె గొడౌన్ నిర్మాణానికి శుక్రవారం ఎంపిపి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు ఈ గొడౌన్ ఉపయుక్తంగా ఉంటుంద న్నారు. అందులో భాగంగానే గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని, మండలంలో గొడౌన్లను నిర్మిస్తున్నారని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్, మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ డీఈ రఘునాథ్, వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్‌విడో డైరెక్టర్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి : ఎమ్మెల్యే తిప్పేస్వామి

ప్రజాశక్తి - అమరాపురం

వైసిపి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివద్ధి సాధ్యమని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోనిలో ఎర్రగుంటపల్లి గ్రామంలో శుక్రవారం ఎంపిపి ఈరన్న ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సీఎం జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలు సక్రమం గా అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మూనిస్వామి, వైస్ ఎంపిపిలు లలితమ్మ, కృష్ణమూర్తి, జడ్పిటిసి సారక్క నరసింహమూర్తి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నళిని రంగేగౌడ్, డైరెక్టర్ వీరక్యాతప్ప, తన్వీర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి, ఎంపిటిసిలు రాజు, జయరామ్, ఆలయ కమిటీ ఛైర్మన్ మంజుననాథ్, సింగిల్‌విండో అధ్యక్షులు చిక్కన్న, వైసిపి నాయకులు, సర్పంచిలు, వివిధ శాఖల అధికారులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

భూమిపూజ చేస్తున్న రఘువీరా దంపతులు

టిటిడి కల్యాణ మండపం నిర్మాణానికి భూమిపూజ

మడకశిర రూరల్ : మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలో టిటిడి సహకారంతో దేవస్థానముల కల్యాణ మండపం నిర్మాణానికి శుక్రవారం మాజీ మంత్రి రఘువీరారెడ్డి దంపతులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రఘువీరా రెడ్డి అన్న చలువమూర్తి రూ. కోటి విరాళం అందజేశారు. అనంతరం రఘువీరారెడ్డి మాట్లాడు తూ రూ. 6 కోట్ల వ్యయంతో కల్యాణ మండపం నిర్మిస్తున్నామని, అందరి సహకారంతో నిర్మాణం పూర్తి చేసి గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో టిటిడి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దివాకర్, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కాంట్రాక్టర్ రంగానాథ్ పాల్గొన్నారు.

19న సోమందేపల్లిలో స్పందన

పెనుకొండ : పెనుకొండ డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 18వ తేదీ (సోమ వారం) సోమందేపల్లిలోని మండల వెలుగు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు స్పందన ఉంటుందని, సబ్ కలెక్టర్‌తో పాటు డివిజన్ స్థాయి అన్ని శాఖల అధికారులు, సోమందేపల్లి మండల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

కదిరి అర్బన్ : పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ఉన్న గాంధీ స్కూల్‌లో ఈ నెల 18వ తేదీ (ఆదివారం) ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తు న్నట్లు డాక్టర్ సివి మదన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల శాంతి రాం కంటి ఆసుపత్రి సౌజన్యంతో కదిరి రోటరీ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్న వైద్య శిబిరంలో కంటి, గుండె, మోకాళ్లకు సంబంధించిన పరీక్షలను ఉచితంగా చేస్తారని తెలిపారు.

'ఇంద్ర' అదనపు స్టాపింగ్‌లకు అనుమతి

కదిరి టౌన్ : కదిరి నుంచి హైదరాబాద్ లోని బిహెచ్ఇఎల్‌కు నడుస్తున్న ఇంద్ర ఎసి బస్సు సర్వీసుకు అదనంగా ముదిగుబ్బ, బత్తలపల్లి, ఎస్‌కె యూనివర్సిటీ, గుత్తి స్టేజిలలో ఆపేందుకు అనుమతులు ఇచ్చినట్లు కదిరి డిపో మేనేజర్ బి.మైనోద్దీన్ తెలిపారు. కర్నూలు, అనంతపురంలో రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ఈ బస్సు కదిరి బస్టాండులో ప్రతి రోజూ రాత్రి 9.30 గంటలకు, అలాగే బిహెచ్ఇఎల్‌లో రాత్రి 9.30 గంటలకు బయల్దేరుతుందన్నారు.

పశుబీమా చేయించండి

గాండ్లపెంట: మండల పరిధిలోని పాడి రైతులు పశువులకు బీమా చేయించుకోవాలని పశు వైద్యాధికారి బి.చెన్నకేశవ నాయక్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా చేయించడం వల్ల పశువులు మృతిచెందితే ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ పాడి రైతులు కుల ధ్రువీకరణ పత్రం జతచేసి నమోదు చేయాలని తెలిపారు.

టిడిపి జిల్లా సాధికారత కన్వీనర్ల నియామకం

మడకశిర : సత్యసాయి జిల్లా వీరశైవ సాధికారిక జిల్లా కన్వీనర్‌గా గుడిబండ మండలానికి చెందిన దుర్గేష్‌ను, కురుబ సాధికారిక జిల్లా కన్వీనర్‌గా డి.గోవిందప్పను నియమించినట్లు శుక్రవారం వారు ఓ ప్రకటనలో తెలిపారు. వీరి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జూలైలో బిసి గర్జన

కదిరి టౌన్ : జూలైలో కదిరిలో 20వేల మందితో బిసి గర్జన భహిరంగ సభ నిర్వహిస్తునట్లు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తల వెంకట రమణ తెలిపారు. పట్టణంలో శుక్రవారం వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బిసిలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 50% రిజర్వేషన్ ప్రధాన లక్ష్యమే ధ్యేయంగా తమ గళం వినిపిస్తామన్నారు. మరోసారి జాతీయ స్థాయి వేదికలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బత్తల వెంకటరమణ, బిసి సంక్షేమ సంఘం ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ బత్తల హరి ప్రసాద్‌ని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. కార్యక్రమంలో బిసి సంఘం ఏపీ అధ్యక్షులు మారేష్, తదితరులు పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం

మడకశిర : మండల పరిధిలోని హరేసముద్రం గ్రామానికి చెందిన యువకులు శుక్రవారం తమ గ్రామా నికి వేళ్లే రహదారిలో ఏర్పడిన గుంతలను పూడ్చారు. హరేసముద్రం గ్రామానికి వెళ్లే రహదారిలో పలుచోట్ల గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడేవారు. దీంతో కొందరు యువకులు రహదారిలో ఉన్న గుంతలను పూడ్చి మానవత్వం చాటుకు న్నారు. నియోజకవర్గంలోని చాలి గ్రామాల్లో రోడ్లు గుంతలు పడి అధ్వాన్నంగా మారాయి. విధిలేని పరిస్థితిలో గ్రామస్తులే ముందుకొచ్చి రోడ్లను బాగు చేసుకోవడం గమనార్హం.

రోడ్లపై గుంతలు పూడుస్తున్న యుకులు

విద్యావ్యవస్థలో సమూల మార్పులు

ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాశక్తి -పెనుకొండ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే శంకర నారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని సెంట్రల్ హై స్కూల్లో శుక్రవారం నియోజకవర్గం స్థాయిలో 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. నాడు-నేడు కింద పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. అనంతరం కొడిగెనహళ్లి పాఠశాల విద్యార్థులు జాహ్నవి, నరసింహానాయుడు, లక్ష్మీవసంత్, ఏపిఆర్‌జెసి విద్యార్థులు వి.సంతోష్, అచ్చుతా నంద్‌నాయక్, రామ్‌చరణ్ తేజ్, రామాంజనేయులు, వంశీకృష్ణలను నగదు, మెమెంటో, మెడల్, ప్రశంసాపత్రంతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓలు గంగప్ప, ఆంజనేయులునాయక్, హెచ్‌ఎం కవిత, కొడిగెనహళ్లి ఏపిఆర్ పాఠశాల హెచ్‌ఎం, కళాశాల ప్రిన్సిపల్, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే ఎంపిపి ప్రమీలమూర్తి, సర్పంచి సుశీల వెంకట కృష్ణారెడ్డి, ఉప సర్పంచి కళావతి, ఎంపిటిసి వెంకట రంగారెడ్డి, తదితరులతో కలిసి మండల పరిధిలోని గంగంపల్లి, దాసిరెడ్డిపల్లి తండాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. గత ప్రభుత్వానికి, జగన్ ప్రభుత్వానికి తేడా గమనించి మరోమారు జగన్‌ను సీఎం చేయాలని ప్రజలను కోరారు. అనంతరం ప్రజలు, నాయకులు ఎమ్మెల్యేని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచిలు గంగప్ప, శ్రీరాములు, మణిశివ శంకర్‌రెడ్డి, సామలపల్లి రాము, పట్టణ కన్వీనర్ ధనుంజయ రెడ్డి, ఎంపిటిసిలు, వార్డ్ మెంబర్లు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే దాసిరెడ్డిపల్లి తండాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించా రు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రజిత ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించగా ఎమ్మెల్యే పిల్లలకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్‌రెడ్డి, సిఐ సుబ్బరాయుడు, సర్పంచి సుశీల వెంకట కృష్ణారెడ్డి, ఎంపిటిసి వెంకట రంగారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు గీతాబాయి, వెంకటశివమ్మ, ఇందుమతి, రత్న, గంగమ్మ, మంజులాబాయి పాల్గొన్నారు.

విద్యార్థులతో ఎమ్మెల్యే శంకరనారాయణ

రైతుల కోసం కల్లం ఏర్పాటు

రొద్దం : రైతులు పండించిన సేంద్రియ పంటలను నూర్పిడి చేయడం, ఎండబెట్టడం కోసం చెరుకూరులో టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో రూ. 3 లక్షల వ్యయంతో కల్లం ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని చెరుకూరులో టింబక్టు కలెక్టివ్ సహకారంతో ఏర్పాటు చేసిన ధరణి సొసైటీ శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని చిన్న, సన్నకారు రైతులతో సేంద్రియ వ్యవసాయం చేపడుతున్నారు. కల్లం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టింబక్టు కలెక్టివ్ వ్యస్థాపకులు బబ్లూ గంగూలీ హాజరై మాట్లాడారు. రైతులు కల్లంను సద్వినియోగం చేసుకొని బాగా నిర్వహణ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి సుభాషిణి, ధరణి సొసైటీ అధ్యక్షులు అక్కులప్ప, సీఈఓ గొంది మహేష్, టింబక్టు కలెక్టివ్ మేనేజర్లు రమేష్, సుకన్య, జాబీర, కార్తీక్, కోఆర్డినేటర్లు సన్నప్పయ్య, నందిని, మండల లీడర్ వెంకటరమణ, టింబక్టు కలెక్టివ్ సేంద్రియ వ్యవసాయ కార్యక్రమం సిబ్బంది, ధరణి పాలకవర్గ సభ్యులు, లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

కల్లంను ప్రారంభిస్తున్న బబ్లూ గంగూలీ, తదితరులు

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ

బత్తలపల్లి : పేద విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని పోట్లమర్రి సర్పంచి అక్కిం దామోదర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వేల్పమడుగు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆయన విద్యార్థుల కు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. హెచ్‌ఎం విజయవాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారని తెలిపారు. అనంతరం పాఠశాలలోని 26 మంది విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కోళ్లమొర్రం చెన్నక్రిష్ణారెడ్డి, వైఎస్ఆర్ఎస్‌యు నాయకులు నరేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు రామాచారి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థినికి బడి బ్యాగు అందజేస్తున్న సర్పంచి దామోదర్

పేదలకు అండగా ఉంటా

బత్తలపల్లి : నియోజకవర్గంలోని పేదలకు అండగా ఉంటామని సామాజికవేత్త గడ్డం రాజుగోపాల్ యాదవ్ పేర్కొ న్నారు. మండల పరిధిలోని నల్లబోయనపల్లి పంచాయతీలో శుక్రవారం గొర్రెల కాపరులకు గొర్రెల మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించి ప్రజలకు భరోసా కల్పిస్తామన్నారు. అనంతరం నల్లబోయనపల్లి, కాటమరుంట, ముద్దనపల్లి గ్రామాల్లో 24 మంది గొర్రెలకాపరులకు రూ. 3,200 విలువ చేసే గొర్రెల మందుల కిట్లు పంపిణీ చేశారు. అలాగే నిరుపేదలు, ప్రమాదంలో గాయపడిన వారికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి ప్రభాకర్, వెంకటేశ్వరరెడ్డి, విశ్వనాథ్, రామ్మూర్తినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం : పల్లె

కొత్తచెరువు : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తచెరువుకు చెందిన రమణమ్మ మృతి చెందగా భర్త సురేందర్, కూతురు ప్రియాంక తీవ్రంగా గాయపడ్డారు. వీరి కుటుంబాన్ని శుక్రవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించి రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే బెంగళూరులోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేంద్ర, ప్రియాంకలకు మెరుగైన వైద్యం అందించాలని ఫోన్ ద్వారా అక్కడి డాక్టర్లను కోరారు. కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు నాగేందర్‌ప్రసాద్, బోయ రాజు, శివప్రసాద్, ప్రభాకర్, సుధాకర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు

ఆర్థిక సాయం అందజేస్తున్న పల్లె రఘునాథ్ రెడ్డి

పచ్చదనం పెంపొందించాలి

కొత్తచెరువు : కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీలో చెట్లను పెంచి పచ్చదనం అభివృద్ధికి కృషి చేయాలని పర్యావరణవేత్త భాస్కర్ నాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం లో సర్పంచి రాధానాగరాజుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన మేరకు గ్రామపంచాయతీలో 10% నిధులు చెట్లు పెంపకానికి ఖర్చు చేయాలని సూచించారు. ప్రభు త్వ స్థలాలు, పాఠశాలలు, కళాశాలల ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం పెంపునకు కృషి చేయాలన్నారు. చెట్లను సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు అన్నారు. వినతి ఇచ్చిన వారిలో రాము, మంజునాథ్, కేశప్ప, తదితరులు పాల్గొన్నారు.

పాడి గేదెలు మృతి

పరిగి : ఇంటి వద్ద ఉన్న రెండు గేదెలకు గుర్తు తెలియని వ్యక్తులు హానికర రసాయనాలు కలిపిన గడ్డి వేయడంతో తిని మృతి చెందాయని పాడి రైతు గంగాధరప్ప వాపోయాడు. రెండు గేదెల విలువ రూ. 1.40 లక్షలు అన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఎబి బర్ధన్ కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కదిరప్ప మాట్లాడుతూ కదిరి-హిందూపురం రోడ్డు సమీపంలో ఉన్న ఎబి బర్ధన్ కాలనీలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉన్నందున రాత్రిపూట ఇళ్లలోకి పాములు వస్తున్నాయన్నారు. ఈ విషయమై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు తెలిపినా ఫలితం లేదన్నారు. ఇకనైనా విద్యుత్ డిఈ స్పందించి కాలనీలోని ప్రతి వీధికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, లేనిచో విద్యుత్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఇలియాకత్, జిల్లా సహాయ కార్యదర్శి గాలివీడు ఉపేంద్ర, నాయకులు శ్రీనివాసులు, జహీర్, ఇస్మాయిల్, బాబాఫకృద్దీన్, రామచంద్ర, మహిళా సంఘం నాయకురాలు జ్యోతి, కల్పన, అంజనమ్మ, రమణమ్మ, దివ్య, రామక్క, సల్మా, ఎస్.గుల్జార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

రాష్ట్ర టిడిపి బిసి సాధికార సమితి సభ్యులుగా రవి

అమరాపురం: రాష్ట్ర టిడిపి బిసి సాధికారసమితి సభ్యులుగా బసవన్నపల్లి దాసరి రవి ఎంపిక పట్ల సంఘం సభ్యులు, టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. తనను ఎంపిక చేసినందుకు టిడిపి అధినేత చంద్రబాబు, రాష్ట్ర సాధికార సంఘం అధ్యక్షులు పళ్ల రవీంద్ర, దాసరి అప్పారావు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామియితీ రవి కృతజ్ఞతలు తెలిపారు.

మలేరియా నివారణపై అవగాహన

రొళ్ల : జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నివారణ చర్యలు తీసుకుంటు న్నట్లు మడకశిర డివిజన్ మలేరియా నివారణ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి తెలిపారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో సందర్భంగా శుక్రవారం ఆయన వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బందితో కలిసి రొళ్ల గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలన్నారు. అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బంది నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ సుజన పోస్టర్లు, కరపత్రాలు, గోడపత్రికలను విడుదల చేశారు.

రొళ్ల గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎస్‌డిజిఎస్ కళాశాలలో అవినీతిపై సమగ్ర విచారణకు డిమాండ్

హిందూపురం : ఎస్‌డిజిఎస్ కళాశాలలో జరిగిన అవినీతిపై విచారణ పేరుతో కాలయాపన చేయకుండా విచారణ పూర్తి చేసి చర్యలు తీసుకోవాలని విద్యార్థి జేఏసి నాయకులు డిమాండ్ చేశారు. కళాశాలలో జరిగిన అవినీతిపై శుక్రవారం ఆర్‌జేడి నాగలింగరెడ్డితో కూడిన బృందం విచారణ చేపట్టారు. ఈ విషయం తెలిసిన వెంటనే విద్యార్థి జేఏసి నాయకులు కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఆర్‌జేడి ఆందోళన చేస్తున్న నాయకులకు విచారణ చేసి చర్యలు తీసుకుంటామని, ఆందోళన విరమించాలని కోరారు. అయితే నాయకులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, ఎన్ఎస్‌యుఐ సంపత్ కుమార్ మాట్లాడుతూ మూడేళ్లలో మూడు సార్లు విచారణ చేపట్టిని ఇంత వరకు విచారణ పూర్తి చేయలేదు. ఎవరిపైన చర్యలు తీసుకోలేదన్నారు. సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసకోవాలన్నారు. లేని పక్షంలో విచారణ కమిటీని మార్చి వేరే కమిటీతో విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, వెంకటాపురం అభిలాష్, జయచంద్ర, హరీష్ పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దౌర్జన్యాలా..?

కదిరిఅర్బన్ : ప్రభుత్వం చేయాల్సిన పనులు, గతంలో జగన్ చేసిన వాగ్దానాల గురించి జనసేనపార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఎత్తి చూపితే, వాటికి సమాధానం చెప్పకుండా చెప్పులు చూపించి, సమస్యల గురించి దాట వేయడం అలవాటు చేసుకున్న వైసిపి వీధి రౌడీల్లారా ఇకనైనా మారాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో హితవు పలికారు. వైసిపిని ప్రజలు వేస్ట్ పార్టీగా భావిస్తున్నారని, భవిష్యత్తులో బంగాళాఖాతంలో కలపడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. వైసిసి నాయకులు చేస్తున్న దోపిడీ పనులను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

వడ్డీ కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేయాలి

గుడిబండ : మండల వ్యాప్తంగా పంట సాగు కోసం బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు వడ్డీని మాత్రమే కట్టించుకుని రెన్యువల్ చేయాలని టిడిపి నాయకులు గుడిబండ కెనరా బ్యాంక్ మేనేజర్ కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప మాట్లాడుతూరైతుల నుంచి అసలు వడ్డీ కట్టించుకోవడం వల్ల రైతులు దళారుల చేతుల్లో చిక్కి తీవ్రంగా నష్టపోతున్నారని ప్రతి ఏటా రైతులు పంటలు సాగు చేసి అతివష్టి అనావష్టి కారణంగానోతీవ్రంగా నష్టపోతు అప్పుల మీద అప్పులు పెరిగి చేతిలో చిల్లగవలేక పంటలు సాగు చేయడానికి స్తోమత లేక తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్న తరుణంలో బ్యాంక్ అధికారులు అసలు వడ్డీ కట్టించుకుని పంట రుణాలను రెన్యువల్చేయడంతో చాలామంది రెన్యువల్ చేసుకోలేకపోతున్నారని వినతి పత్రాన్ని సమర్పించారు బ్యాంక్ మేనేజర్ స్పందిస్తూ ఈ విషయాన్ని పై అధికారుల దష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఆసుపత్రి కమిటీ చైర్మన్ శివకుమార్, దుర్గేష్, రవిస్వామి, నరేంద్ర, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న టిడిపి నాయకులు

నిరుపేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలి

లేపాక్షి: రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 455-2 లోని 1.15 సెంట్లలో గత పది సంవత్సరాల నుండి గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం సిపిఐ ఆద్వర్యంలో ఇంచార్జ్ తహశీల్దార్ కుమార్ రెడ్డి కి వినతీపత్రం అందజేశారు. ఈ మేరకు సిపిఐ నిరుపేదల కోసం 2013 లోనే ఆస్థలంలో గుడిసెలు వేశామని అన్నారు. అధికారులు అనేక కారణాలు చెబుతూ నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఇంటి పట్టాలు మంజూరులో అలసత్వం వహిస్తే ఉద్యమాన్ని ఉదతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు శివప్ప, నారయణరెడ్డి, గౌతంకుమార్ పాల్గొన్నారు.

రొళ్ల ఎంపిడిఒగా ఆజాద్

రొళ్ల : మండల ఎంపీడీవోగా ఆజాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రామగిరి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒకు సర్పంచిలు, ఎంపిటిసిలు, జెసిఎస్ కన్వీనర్, సోషల్ మీడియా కన్వీనర్, మండల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు, వైసిపి నాయకులు పూలమాల వేసి సాదర స్వాగతం పలికారు.

రామాలయానికి 'పల్లె' విరాళం

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో రామస్వామి దేవస్థానం నిర్మాణానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి శుక్రవారం రూ. 40 వేలు విరాళం అందజేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి అయ్యే ఖర్చులను తనే భరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీరామ్ రెడ్డి, విజయ్ కుమార్, బొమ్మయ్య బత్తలపల్లి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మసీదు అభివృద్ధికి చేనేత ప్రముఖుల ఆర్థికసాయం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శివానగర్లో మసీదు, మదారస అభివద్ధి కోసం చేనేత ప్రముఖులు శుక్రవారం విరాళం అందజేశారు. ఈ మేరకు చేనేత ప్రముఖులు కాచర్ల అంజి రూ. 25వేలు, సిద్ది రాజేష్ నేత రూ. 25 వేలు, చింతా బాలకృష్ణ రూ. 25వేలు, విరాళాన్ని మసీదు పెద్దలకు అందజేశారు. దీంతో చేనేత ప్రముఖులకు ముస్లిం పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం అందిస్తున్న చేనేత ప్రముఖులు

రేపు టిడిపి విస్తృతస్థాయి సమావేశం

కదిరి టౌన్ : పట్టణంలోని పివిఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం టిడిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడంతో పాటు పార్టీ కార్యక్రమాలు, ఇటీవల మహానాడులో ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై చర్చిస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మస్తాన్‌వలి దర్గా నూతన కమిటీ ఎన్నిక

కొత్తచెరువు : స్థానిక షాదీ మహల్‌లో శుక్రవారం షాదీ మహల్ చైర్మన్ జాకీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మస్తాన్‌వలి దర్గా నూతన కమిటీని ఎన్నుకున్నారు. దర్గా అధ్యక్షునిగా అజిజిల్ రెహ్మాన్, వైస్ ప్రెసిడెంట్‌గా అస్లాంబాషా, సెక్రటరీగా మహమ్మద్ ఇసాక్‌తో పాటు 10 మంది ఈసీ సభ్యులను ఎన్నుకున్నారు, ఇందుకు సహకరించిన సత్యసాయి జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ నూరుల్లాకు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

12 మంది జూదరులు అరెస్ట్

రూ. 40,100 నగదు, 4 బైకులు, 7 సెల్ ఫోన్లు స్వాధీనం

గుడిబండ : మండల పరిధిలోని తాళికెర గ్రామ పరిసర ప్రాంతాల్లో అమరాపురం, గుడిబండ మండలాలకు చెందిన పలువురు జూదం నిర్వహిస్తుండగా పక్కా సమాచారం అందుకున్న గుడిబండ ఎస్సై ముని ప్రతాప్ తన సిబ్బందితో వెళ్లి జూదర గహంపై దాడులు నిర్వహించి 12 మంది జూదరులను అదుపులోకి తీసుకొనివారి వద్ద నుండి 40.100 నగదును.4 బైకులు 7 సెల్ ఫోన్లు స్వాధీనపరచకున్నట్లు గుడిబండ ఎస్సై ముని ప్రతాప్ తెలిపారు. వీరందరిపై గ్యాంబ్లింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసుకొని వారిని కోర్టుకు హాజరు పరచనునట్లు ఆయన తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు

రొళ్ల : మండల పరిధిలోని హొట్టెబెట్ట గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మ కుమార్తె వనజ(16) ఈ నెల 12నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు అందినట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. రామలక్ష్మమ్మ భర్త లక్ష్మీకాంత్ స్వగ్రామం పులివెందుల నియోజకవర్గంలోని నంద్యాలంపల్లి గ్రామం కాగా వనజ తన అత్తగారైన నాగమ్మ ఇంట్లో ఉండి చదువుకుంటోంది. పదో తరగతిలో రెండు సబ్జెక్టులో ఫెయిల్ కాగా సప్లిమెంటరీ పరీక్షలు రాసింది. ఈ నెల 12న అత్తగారి ఇంటి నుంచి వెళ్లిన వనజ తిరిగి రాకపోవడం, అమ్మ ఊరికి కూడా వెళ్లకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

అరకొర పాఠ్యపుస్తకాలతో విద్యార్థుల అగచాట్లు

మడకశిర : విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని పేర్కొంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు నేటికీ పూర్తిస్థాయిలో పుస్తకాలు సరఫరా చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థికి ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు కల్పిస్తామని ప్రతి సమావేశంలో ముఖ్యమంత్రి మొదలుకొని మంత్రులతో సహా ఎమ్మెల్యేలు మైకుల్లో ఊదరగొడు తున్నారు. అయితే పాఠశాలలు పునఃప్రారంభించి వారం గడుస్తున్నా ఇంతవరకు విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి రాలేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని అగలి, రొళ్ల, గుడిబండ, అమరాపురం మండలాల్లో ఈ పరిస్థితి నెలకొని ఉంది. ఆయా ఎంఆర్సీ కార్యాలయాలకు పాఠ్యపుస్తకాలు ముందుగానే చేరినా విదార్థుల సంఖ్యకు అనుగుణంగా రాకపోవడంతో ఉన్న వాటినే ఉపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు మండలాల్లోని పాఠశాలలకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధిక ఫీజుల వసూలుపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా వ్యాప్తంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఇందిరా పార్కులో శుక్రవారం వారు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, ఎన్ఎస్‌యుఐ జాతీయ కో ఆర్డినేటర్ సంపత్ కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ అభిలాష్‌లు మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఫీజులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆయా విద్యాసంస్థలపై ప్రత్యక్ష దాడులకు సిద్ధం అవుతామన్నారు. దీనికి పూర్తి బాధ్యత విద్యాశాఖ అధికారులే వహించాల్సి ఉంటుందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘ నాయకులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పుట్టపర్తి రూరల్ : గ్రామాల్లో, పట్టణాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్థానిక పిహెచ్‌సి వైద్య సిబ్బంది పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాలు, ఉధృత అతిసార నివారణ పక్షోత్సవాలు సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని జగరాజుపల్లి గ్రామంలో అవగాహన కల్పించారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రజలు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతి ఫ్రైడేని డ్రైడేగా పాటించాలని, దోమతెరలు వాడాలని సూచించారు. ఉధృత అతిసార పట్ల ప్రజలు అవగాహన కల్గి ఉండాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ నగేష్, ఎస్‌యు ఓ రమణయ్య, ఎంఎల్‌హెచ్‌పి అపర్ణ, ఆరోగ్య కార్యకర్త ప్రమీల, ఆశా కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.

హోంగార్డులకు ఘనంగా వీడ్కోలు

పుట్టపర్తి రూరల్ : హిందూపురం పట్టణంలో హోంగార్డులుగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఎం.నాగరాజు, పిఎల్ఎన్.స్వామిలకు శుక్రవారం స్థానిక పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏఆర్ డిఎస్‌పి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ 30 ఏళ్ల విధుల్లో ఎక్కడా ఎటువంటి మచ్చ లేకుండా విధులు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. పదవీ విరమణ పొందిన హోంగార్డులు విధి నిర్వహణలో వారి అనుభవాలను సిబ్బందితో పంచుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడ్మిన్ ఆర్ఐ టైటస్, హోంగార్డ్స్ ఆర్ఐ శ్రీశైలంరెడ్డి, ఎంటిఓ నారాయణ, ఆర్ఎస్ఐలు రాజు, ప్రదీప్‌సింగ్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎం.నాగరాజు, పిఎల్ఎన్.స్వామిలను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

పాత్రికేయునిపై దాడి హేయం

సోమందేపల్లి : గోరంట్లలో పాత్రికేయుడిపై దాడి చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ శంకర్, సీనియర్ అసిస్టెంట్ సిద్దేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ పాత్రికేయుడిపై దాడిని ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఘటనకు కారకులైన వారిని అధికారులు శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో పాత్రికేయులు శ్రీనివాసులు, సుధీర్‌రెడ్డి, వాసు, రఘునాథరెడ్డి, ఆదినారాయణ, మనోహర్, బాబా, మధు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

డిటికి శంకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పాత్రికేయులు

చిలమత్తూరు: గోరంట్ల మండలానికి చెందిన సీనియర్ పాత్రికేయుడిపై దాడి చేసిన దుండగులను గుర్తించి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ చిలమత్తూరులో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భాల్లో పాత్రికేయులు మాట్లాడుతూ వాస్తవ కథనాలు ప్రచురిస్తే దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం పాత్రికేయులు శివకుమార్, పవన్‌కుమార్, విశ్వనాథ్, గంగరాజు, షామీర్, రామంజి, బాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: పాత్రికేయునిపై దాడిని మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. అలాగే జిల్లా ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, పెనుగొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి నరసింహులు బాధిత పాత్రికేయుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రికలో వచ్చిన కథనాలను ఖండించాలి కానీ ఇలా దాడి చేయడం అమానుషమన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు